

# న్యూస్ వార్ వార్తా పత్రిక

RNI: APTEL/2010/36742

TELANGANA RISING GLOBAL SUMMIT

నల్లగొండ | epaper.news war.com | శుక్రవారం 27, మార్చి 2026 | సంపుటి :16 సంచిక :9 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00



## సీతారాముల వారికి పటు వస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్: మంత్రి తుమ్మల

శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు. మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు తెలంగాణ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు.మొత్తం రూ.586 కోట్లతో రామాలయంతో పాటు భద్రాచలం పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు.

## బీఆర్ఎస్ చేసిన అప్పుల భారాన్ని
# ఇంకా మోస్తున్నాం

- పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయి
- విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవు
- కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతాం
- టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తాం
- ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన నేడు(గురువారం) అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి.

2 లో..

## కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీ లేదు..



### అసెంబ్లీలో మైక్ కట్ చేయడంపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం

రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేందుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

వార్త 2లో



## ఘోర రోడ్డు ప్రమాదం.. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి..

వార్త 2లో

### ఇంధన నిల్వలు ఉన్నాయి..
## ఆందోళన వద్దు: స్టీఫెన్ రవీంద్ర

రాష్ట్రంలో ఇంధన నిల్వలు ఉన్నాయని.. దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రజలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. బుధవారం 2,123 ట్యాంకర్స్ పెట్రోల్ సరఫరా చేశామన్నారు. అలాగే 10,799 లీటర్లు సరఫరా చేశారని వివరించారు. యావరేజ్‌గా 5,883 లీటర్ల పెట్రోల్ వినియోగం ఉంటే.. బుధవారం ఒక్క రోజే 84 శాతం అధికంగా పెట్రోల్ సరఫరా చేశారని చెప్పారు.



వార్త 2లో



## రాబోయే రోజుల్లో ప్రభుత్వాన్ని బీసీలే బొంద పెడుతారు: ఎమ్మెల్యే తలసాని

బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. బీసీల సంక్షేమానికి ప్రతి వార్షిక బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని ఆయన సోదాహరణగా వివరించారు.

వార్త 2లో




## ఇరాన్ టోల్ ఫీజు వసూలు చేస్తోందా.. హోర్ముజ్‌లో నౌకలు నగదు చెల్లిస్తున్నాయా..

వార్త 2లో

## ఇరాన్‌కు బిగ్ షాక్.. ఇజ్రాయెల్ దాడిలో నేవీ చీఫ్ మృతి!

అమెరికా-ఇజ్రాయెల్ తో జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ కు మరో పెద్ద దెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ నేవీ చీఫ్ అలిరెజా తంగ్సిరీ మృతి చెందినట్లు తెలుస్తోంది. తమ దాడుల్లో ఇరాన్ నేవీ చీఫ్ మరణించినట్లు తాజాగా ఇజ్రాయెల్ తెలిపింది.ఇరాన్ శక్తివంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నౌకాదళ విభాగానికి నాయకత్వం వహించిన తంగ్సిరి, ఓడరేవు పట్టణమైన బందర్ అబ్బాస్‌లో జరిగిన దాడిలో మరణించినట్లు సమాచారం. హోర్ముజ్ జలసంధిని మూసివేయడాన్ని పర్యవేక్షించే బాధ్యత కమోడోర్ తంగ్సిరి నిర్వహిస్తున్నాడని ఇజ్రాయెల్ అధికారి తెలిపారు. అయితే, ఈ దాడి గురించి ఇరాన్ నుండి ఎలాంటి స్పందన రాలేదు.



## హైదరాబాద్ లో గ్యాస్ కొరత.. ఆటో నుంచి సిలిండర్లు ఎత్తుకెళ్లేందుకు యత్నం

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ లో వంట గ్యాస్ కొరత ఏర్పడింది. ఎల్ పిజి సిలిండర్ల కొరత లేదని కేంద్రం చెబుతున్నా.. సిలిండర్లు బుకింగ్ అయినా డెలివరీ కావడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గురువారం హైదరాబాద్ లో వంట గ్యాస్ సిలిండర్ల కొరత మరోసారి కనిపించింది. గ్యాస్ బుక్ చేసి చాలా రోజులు గడుస్తున్నా ఇంకా సిలిండర్ రాలేదని వినియోగదారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో గ్యాస్ ఆటో నుండి సిలిండర్లు ఎత్తుకెళ్లేందుకు వినియోగదారులు ప్రయత్నించారు. ఈ ఘటన ఫిలింనగర్ పరిధిలోని షేక్‌పేట్ లో చోటుచేసుకుంది. గ్యాస్



ఏజెన్సీ నుండి సిలిండర్లతో బయటికి వచ్చిన ఆటో నుండి అనుమతి లేకుండా కొందరు సిలిండర్లు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వెంటనే ఏజెన్సీ సిబ్బంది, స్థానికులతో కలిసి వారిని అడ్డుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కొత్త ట్విస్ట్.. డాక్టర్‌ని అదుపులోకి తీసుకున్న సిట్

వార్త 2లో

# బీఆర్ఎస్ చేసిన అప్పుల భారాన్ని ఇంకా మోస్తున్నాం

పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయి
విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవు
కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతాం
టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తాం
ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన నేడు(గురువారం) అసెంబ్లీ



సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాస్పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరిం చారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నా యని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు రేవంత్. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని చెప్పారు రేవంత్ రెడ్డి. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకువస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.

## సీతారాముల వారికి పటు వస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్: మంత్రి తుమ్మల

భద్రాచలం, న్యూస్‌వార్ ప్రతినిధి

శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు తెలంగాణ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు.మొత్తం రూ.586 కోట్లతో రామాలయంతో పాటు భద్రాచలం పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని మిథిలా కళ్యాణ మండపం వేదికగా స్వామివారి కళ్యాణం జరుగుతుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు.అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీసీతారామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి సమర్పించనున్నారని తెలిపారు. అందుకు శుక్రవారం భద్రాచలానికి సీఎం రేవంత్ వస్తున్నారన్నారు. ఆయనకు ప్రజల తరపున ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, ఎయిర్ పోర్టు ఏర్పాటు దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ ఏర్పాటుకు అవకాశం ఉందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులు చేపట్టినట్లు చెప్పారు. సీతారాముల కళ్యాణం వీక్షించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై దేవాలయం అధికారులు, సిబ్బందికి మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

## కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీ లేదు..

### అసెంబ్లీలో మైక్ కట్ చేయడంపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేందుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి తీసుకురాకుండా ప్రభుత్వం అడ్డుపడుతోందన్నారు.హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.32 కోట్లు ఖర్చయ్యేవి. 2023 నాటికి ఇది రూ.68 కోట్లకు చేరుకుంది. కానీ.. ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది. జనాభా పెరుగుదల, వైద్య ఖర్చుల పెరుగుదల దృష్ట్యా ఈ పెంపు సహజం, ఇందులో కాంగ్రెస్ కొత్తగా సాధించిన ఘనతేమీ లేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, పనులు చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ ఆస్పత్రులన్నీ పూర్తై ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మరింత అండగా నిలవాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్సైజ్ అదాయంలో వాటాను పెంచి నిధులను సమకూర్చింది' అని అన్నారు.

## ఇంధన నిల్వలు ఉన్నాయి.. ఆందోళన వద్దు: స్టీఫెన్ రవీంద్ర

హైదరాబాద్,

రాష్ట్రంలో ఇంధన నిల్వలు ఉన్నాయని.. దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రజలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. బుధవారం 2,123 ట్యాంకర్స్ పెట్రోల్ సరఫరా చేశామన్నారు. అలాగే 10,799 లీటర్లు సరఫరా చేశారని వివరించారు. యావరేజ్‌గా 5,883 లీటర్ల పెట్రోల్ వినియోగం ఉంటే.. బుధవారం ఒక్క రోజే 84 శాతం అధికంగా పెట్రోల్ సరఫరా చేశారని చెప్పారు. 22,127 కిలో లీటర్ల డీజిల్ ఆయిల్ కంపెనీలు సరఫరా చేశాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ 596 అవుట్ లెట్స్ ఉన్నాయని అన్నారు. ప్రతీ బంక్‌లో పౌరసరఫర, సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీస్, లీగల్ మెట్రాలజీ అధికారుల బృందం పరిశీలన చేస్తుందని తెలిపారు. బుధవారం కంటే.. గురువారం పెట్రోల్ బంకుల వద్ద రద్దీ తగ్గిందన్నారు. రాష్ట్రంలో గృహ వినియోగంలో 1,28,24,087 ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయని.. ప్రతీ రోజు 2,20,000 గ్యాస్ బుకింగ్స్ జరుగుతున్నాయని పేర్కొన్నారు.బుధవారం ఒక్క రోజే 2,19,980 సిలిండర్లు సరఫరా చేశామన్నారు. వినియోగదారులు అధికంగా బుకింగ్స్ చేయడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడుతుందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు. అలాగే 1,03,275 పైప్ న్యాచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. 2,78,418 క్యూబిక్ మీటర్లు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కేంద్రం ఆదేశాల మేరకు పీఎన్జీ, సీఎన్జీని విస్తరించాల్సి ఉందని చెప్పారు. 24 గంటల్లో ప్లాంట్లకు అనుమతి ఇవ్వడంతో పాటు పలు రాయితీలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు.

## ఘోర రోడ్డు ప్రమాదం.. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి..

హైదరాబాద్:

ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో 13 మంది మృతిచెందడం, 20 మందికి తీవ్రగాయాలు కావడంపై సీఎం రేవంత్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు.నిర్మల్ నుంచి నెల్లూరు వైపు బస్సు వెళుతున్న నేపథ్యంలో మృతిచెందిన, గాయపడిన వారి వివరాలను తెలుసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించాలని ఆజ్ఞాపించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ సీఎస్ సాయిప్రసాద్‌తో ఆయన మాట్లాడారు. ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.కాగా, ఇవాళ(గురువారం) తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్రం నిర్మల్ నుంచి ఏపీలోని నెల్లూరు వైపునకు వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం వద్దకు రాగానే కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్, హరికృష్ణ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఒక్కసారిగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 13 మంది సజీవ దహనమవ్వగా.. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మార్కాపురం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనిత, సవిత, రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సహా పలువురు స్పందించారు.

## రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీలే బొంద పెడుతారు: ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. బీసీల సంక్షేమానికి ప్రతి వార్షిక బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని ఆయన సోదాహరణగా వివరించారు. గురువారం హైదరాబాద్‌లో అసెంబ్లీ సమీపంలోని గన్ పార్క్ వద్ద బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేశారన్నారు.కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో అబద్ధాలు చెప్పించి బీసీల ఓట్లు దండుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి ఏడాది బీసీ సబ్ ప్లాన్‌కు రూ.800 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. రెండో ఏడాది రూ.11 వేల కోట్లు నిధులు కేటాయించి.. కేవలం రూ. 3 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే టైం వచ్చిందని చెప్పారు. రాబోయే రోజుల్లో బీసీలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెడతారని జోస్యం చెప్పారు. లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో జనరల్ స్థానాల్లో బీసీలు గెలిచారని.. ఇది దేనికి సంకేతమో అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ నేతలకు ఆయన సూచించారు.బీసీ విద్యార్థుల కోసం పెద్ద ఎత్తున గురుకులాలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని తలసాని శ్రీనివాస్ యాదవ్ గుర్తు చేశారు. అలాగే లింగయ్య యాదవ్‌ను రాజ్యసభకు పంపించారని తెలిపారు. చాలా మంది బీసీ నాయకులకు అత్యున్నత పదవులు ఇచ్చిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. కుల వృత్తులను ప్రోత్సహించిన ఘనత సైతం కేసీఆర్‌దేనని తలసాని శ్రీనివాసయాదవ్ తెలిపారు.9 షెడ్యూల్‌లో చేర్చకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరుతో మోసం చేశారని కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను బీసీలు గమనిస్తూనే ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనీ బొంద పెట్టడం ఖాయమని తలసాని శ్రీనివాసయాదవ్ జోస్యం చెప్పారు. గన్ పార్క్ వద్ద నిర్వహించిన నిరసనలో మాజీ మంత్రి హరీశ్ రావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కొత్త ట్విస్ట్.. డాక్టర్‌ని అదుపులోకి తీసుకున్న సిట్

హైదరాబాద్,

మొయినాబాద్ డ్రగ్స్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా జూబ్లీహిల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ బాలాజీని అదుపులోకి తీసుకుంది. ఈ అరెస్టుతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లో ఉన్న మరిన్ని పేర్లు వెలుగులోకి వస్తున్నాయి.

### ఫామ్‌హౌస్ కేంద్రంగా డ్రగ్స్ పార్టీలు

విచారణలో తేలిన వివరాల ప్రకారం, రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌ను డ్రగ్స్ పార్టీల కోసం ఒక 'డెన్'గా వినియోగించినట్లు సిట్ గుర్తించింది. గతంలో పట్టుబడిన రోహిత్ రెడ్డి, రితీష్ రెడ్డిలను విచారించిన సమయంలో డాక్టర్ బాలాజీ పేరు బయటకు వచ్చింది. డ్రగ్ పెడ్లర్ రాకేష్ వర్మ నుంచి డాక్టర్ బాలాజీకి వీణహీూ వంటి ప్రమాదకరమైన డ్రగ్స్ అందినట్లు ఆధారాలు లభించాయి.

### నిందితుల సంఖ్య 15కు చేరిక

ఈ కేసులో లోతైన విచారణ జరుగుతున్న కొద్దీ నిందితుల జాబితా పెరుగుతోంది. ఇప్పటివరకు 11 మందిగా ఉన్న నిందితుల సంఖ్య, తాజా అరెస్టులతో 15కు చేరింది. పెడ్లర్ రాకేష్ వర్మ, అభిషేక్, డాక్టర్ బాలాజీలతో పాటు మరో వ్యక్తిని కూడా నిందితుల జాబితాలో చేర్చారు.

### ముగ్గురి కోసం వేట

ప్రస్తుతం ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారు. వారి కోసం సిట్ బృందాలు గాలిస్తున్నాయి. డాక్టర్ బాలాజీకి డ్రగ్స్ సరఫరా చేయడమే కాకుండా, అతను ఈ పార్టీల నిర్వహణలో ఏవైనా ఇతర బాధ్యతలు చేపట్టాడా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఉన్నత వర్గాలకు చెందిన వారు ఈ కేసులో ఇరుక్కోవడంతో నగరంలో తీవ్ర కలకలం రేగుతోంది.

## ఇరాన్ టోల్ ఫీజు వసూలు చేస్తోందా.. హోర్ముజ్‌లో నౌకలు నగదు చెల్లిస్తున్నాయా..

హైదరాబాద్,( న్యూస్‌వార్ ప్రతినిధి

పశ్చిమాసియాలో చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ నియంత్రిస్తున్న సంగతి తెలిసిందే. హోర్ముజ్‌ను ఇరాన్ మూసివేయడంతో పలు దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకున్నాయి. అయితే ఈ జలసంధిని భారత్ సహా ఐదు మిత్ర దేశాల కోసం తెరుస్తున్నట్టు తాజాగా ఇరాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మరో సంచలన వార్త బయటకు వచ్చింది. హోర్ముజ్ గుండా ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ రివల్యూషనరీ గార్డులు (×=+జ) చాలా రోజుల నుంచి అనధికారికంగా టోల్ ఫీజు వసూలు చేస్తున్నారట. హోర్ముజ్‌లో ఇరాన్ రివల్యూషనరీ గార్డులు అనధికారికంగా టోల్ బూత్ వ్యవస్థను నడపుతున్నారని షిప్పింగ్ న్యూస్ వెబ్‌సైట్ 'లాయిడ్స్‌లిస్ట్' పేర్కొంది. మార్చి 13వ తేదీ నుంచి ఆ ఫీజులు వసూలు చేస్తున్నట్టు తెలిపింది. ఐఆర్‌జీసీ నిర్దేశించిన ఫీజు కట్టి ఇప్పటివరకు 26 నౌకలు హోర్ముజ్ దాటినట్టు 'లాయిడ్స్‌లిస్ట్' వెల్లడించింది. ఫీజు కట్టిన తర్వాత కూడా ఆ నౌకలు ఎప్పటిలా సాధారణ మార్గంలో ప్రయాణించలేదట. ఇరాన్ అధికారులు అనుమతించిన మార్గంలోనే ప్రయాణించాయట .పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన నాటి నుంచి భారత్‌కు రావాల్సిన ఐదు నౌకలు హోర్ముజ్‌ను దాటాయి వాటిల్లో ఇప్పటికే మూడు భారత పోర్టులకు చేరుకున్నాయి. మరో రెండు నౌకలు ఈ వారాంతానికి చేరుకోబోతున్నాయి. అయితే భారత్‌కు చెందిన నౌకలు కూడా ఈ టోల్ ఫీజులు చెల్లించాయా, లేదా అనే విషయంలో క్లారిటీ లేదు.

## భూముల కేటాయింపుతో ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం : శ్రీధర్ బాబు

హైదరాబాద్:

దావోస్ పర్యటనల్లో 44 ఎంవోయూలు ప్రభుత్వం కుదుర్చుకుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రానికి రూ. 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దావోస్ పెట్టుబడులపై శ్రీధర్ బాబు మాట్లాడారు. పెట్టుబడులతో 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తాయని, 2024 దావోస్ లో 18 ఎంవోయూలు.. రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలియజేశారు. రూ.81,800 కోట్ల పెట్టుబడులతో 6 కంపెనీలకు భూముల కేటాయింపు జరిగిందని, భూముల కేటాయింపుతో ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం కేటాయించామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మరో 3 కంపెనీలకు రూ.30 వేల కోట్ల పెట్టుబడుల కోసం భూముల గుర్తింపు చర్యలు చేశామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో 11 కంపెనీలు కార్యకలాపాలు జరిగాయని అన్నారు. నిజామాబాద్ లో 681 సీట్ల సామర్థ్యంతో ఐటి టవర్ నిర్మించామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో ప్రస్తుతం 276 మంది ఉద్యోగాలు పనిచేస్తున్నారని అన్నారు. పెట్టుబడుల ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, పరిశ్రమల ఏర్పాటు వల్ల రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు, ఉపాధి లభిస్తుందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## సిరిసిల్లలో విషాదం.. మూడేళ్ల కొడుతో బావిలో దూకిన తల్లి..

ఓ మహిళ తన మూడేళ్ల బిడ్డతో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం రంగంపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎలవేని రేఖ(25) అనే మహిళ, తన కుమారుడు (3)తోపాటు.. తల్లిగారి ఇంటి వద్ద ఉన్న వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో తల్లి, కొడుకు ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను బావి నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆరా తీసిన పోలీసులు.. కుటుంబ సమస్యల కారణంగానే రేఖ ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

# పెట్రోల్ కోసం పరుగులు

**ఇరాన్ యుద్ధం ఎవరికి ఏరకం లాభం కలిగిస్తుందో ఇదమిద్ధంగా తెలియదు గానీ ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం మాత్రం అట్టుడికిస్తున్నది. ట్యాంకర్ల రాక ఆలస్యం కావడం వల్ల ఏర్పడిన వంటగ్యాస్ కొరత ఇంకా ఒక కొలిక్కి రాలేదు. మన రాష్ట్రంలో వాణిజ్య గ్యాస్ సరఫరా సమస్య చుక్కలు చూపిస్తున్నది. ఫలితంగా టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, హాస్టళ్ల పరిస్థితి దారుణంగా ఉన్నది. గృహోపయోగ గ్యాస్ సరఫరా ఇంకా మెరుగుపడకపోవడంతో ఎండలో బండలతో ప్రజలు బారులుతీరి నిలువాల్సి వస్తున్నది. ఇదిలా ఉంటే మరోవైపు పెట్రోల్ సరఫరా డోలాయమానంలో పడింది. సీఎన్జీతో పాటు పెట్రోలు, డీజిల్‌కు కొరత ఏర్పడటంతో అనేక బంకులు నోస్టాక్ బోర్డులు పెట్టాయి. దీంతో ప్రజలు ఆందోళనకు గురై దొరికినచోట దొరికినట్టు ట్యాంకులు నింపేసుకుంటున్నారు. ఫలితంగా తర్వాత ఎప్పుడో రావాల్సిన కొరత ఇప్పుడే కృత్రిమంగా ఏర్పడుతున్నది. బంకుల వద్ద వాహనాలు కిక్కిరిసిపోవడంతో ట్రాఫిక్ సమస్యలూ తలెత్తుతున్నాయి. పోలీసులు రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఏం చేయాలి? ప్రజలకు నిజాలు చెప్పి భరోసా కల్పించాలి. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఏం చెప్పాలనుకున్నారో తెలియదు కానీ ఆందోళన తగ్గించే బదులు, మరింత పెంచేలా వ్యాఖ్యలు చేశారు. కరోనా కాలం నాటి పరిస్థితులు వస్తాయని ఆయన చెప్పడం ఏరకంగా చూసినా ఆమోదయోగ్యం కాదు.**

కరోనా అనగానే ప్రజలకు అనాలోచితంగా, ఉన్నపళంగా ప్రకటించిన లాక్ డౌన్ గుర్తుకు వస్తుంది. దానివల్ల ప్రజలు, ముఖ్యంగా బతుకుతెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలసపోయిన కార్మికులు అనుభవించిన నరకం గురించి తెలిసిందే. ఓవైపు ప్రజలు పెట్రోల్ కోసం వీధులకెక్కితే ప్రభుత్వం ఆలస్యంగా చమురు కంపెనీలతో ప్రకటనలు చేయించి చేతులు దులిపేసుకున్నది. యుద్ధం వల్ల చమురు సమస్య ఏర్పడిందనేది ఎవరూ కాదనరు. దానికి హోర్ముజ్ జలసంధిలో ఏర్పడిన ప్రతిష్టంభన అగ్నికి ఆజ్యంపోసింది. ఇరాన్ ఎదురుదాడుల వల్ల పశ్చిమాసియాలోని అనేక చమురు క్షేత్రాలు బుగ్గిపాలయ్యాయి. వాటిని బాగుపరచడం ఇప్పటికిప్పుడు అయ్యే పనికాదు. కొన్ని చమురు క్షేత్రాలు మళ్లీ పనిచేయడానికి కనీసం ఐదేండ్లు పడుతుందని అంటున్నారు. చమురు సమస్యకు అదనంగా ఎరువుల సమస్య కూడా తోడవుతున్నదని, దీనివల్ల ఆహార భద్రతకు ముప్పు తలెత్తుతున్నదని ప్రపంచ వాణిజ్య సంస్థ హెచ్చరించడం గమనార్హం. ఇండియా నుంచి ఇటలీ దాకా అన్ని దేశాలూ దీనివల్ల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకు సరైన వ్యూహాలు వేసుకోవాలి తప్ప ప్రజలను కరోనా పేరు చెప్పి భయభ్రాంతులకు గురిచేయడం అర్థరహితం. అటు తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ జాతీయ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పశ్చిమాసియా యుద్ధ పరిణామాలు, చమురు, గ్యాస్ కొరత నేపథ్యంలో ఎలాంటి సన్నద్ధతతో ఉన్నారని విలేకరి అడిగితే అందరూ సూర్య భగవానుడిని ప్రార్థించాలని, పూర్వం మాదిరిగా రాళ్లతో నిప్పు పుట్టించే మార్గాన్ని అనుసరిండమే ఉత్తమమని చెప్పుకొచ్చారు. ఒక ముఖ్యమంత్రి, ఒక తీవ్రమైన సమస్యపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదం. మరోవైపు వంటగ్యాస్ కొరతపై మాట్లాడిన పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రజలు ప్రత్యామ్నాయాలు చూసుకోవాలంటూ ఉచిత సలహా ఇచ్చారు. అందుకే ఈ సంక్షోభంపై శాసనసభలో లోతుగా చర్చించేందుకు అవకాశం కల్పించాలని విపక్ష బీఆర్ఎస్ డిమాండ్ చేయడం తెలిసిందే.ప్రపంచంలో అత్యధిక చమురు వినియోగించే దేశాల్లో భారత్ మూడోస్థానంలో ఉన్నది. మన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉంటాయి. ఈ దృష్ట్యా చూస్తే ప్రభుత్వం రాబోయే సంక్షోభాన్ని గుర్తించి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైంది. ఇప్పుడు ఆలస్యంగా నిద్రలేచి సంక్షోభ నివారణ మార్గాలు సూచించేందుకు ఏడు సాధికార కమిటీలు వేస్తున్నట్టు ప్రకటించింది. వ్యూహాత్మక నిల్వలు తొమ్మిదిన్నర రోజులకు మాత్రమే సరిపడా ఉన్నాయని సమాచార హక్కు



చట్టం కింద వేసిన పిటిషన్‌కు సమాధానంగా ప్రభుత్వం వెల్లడించింది. దీనికి అదనంగా 64.5 రోజుల సాధారణ నిల్వలు ఉన్నాయి. అంటే మొత్తం సుమారుగా 74-75 రోజులకు ఇవి సరిపోతాయి. ఆ తర్వాత ఏమిటనేది ప్రశ్న. ఈ సమ స్య ఎప్పుడు ఎలా తీరుతుందనేది ప్రభుత్వం చెప్పలేకపోతున్నది. సామర్థ్యాన్ని విస్తరించుకొని, సకాలంలో నిల్వలు పెంచుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. ఇది మన సంసిద్ధతలోని డొల్లతనాన్ని తెలియజేస్తున్నది.

# దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

### ఇంధన ధరల్లో కూడా మార్పులు లేవు
### దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ సరఫరా
### బ్లాక్ మార్కెటింగ్‌పై దాడులు కొనసాగిస్తున్నాం
### పైప్డ్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానికే ప్రాధాన్యం
### ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మరోమారు ప్రకటన

న్యూఢిల్లీ,

పైపులతో నేచురల్ గ్యాస్ కు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, పెట్రోల్, డీజిల్‌కు దేశంలో ఎలాంటి కొరత లేదని, ఇంధనం ధరల్లో కూడా మార్పు లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారంనాడు ప్రకటించింది. వదంతులు నమ్మవద్దని కోరింది. గృహావసరాల కోసం వందశాతం పీఎన్‌జీ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ తెలిపారు. ఈ మేరకు నోటీఫికేషన్ ఇచ్చామని, నిర్దిష్ట కాలపరిమితి లోపు దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ మౌలిక వసతుల అభివృద్ధి జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో ఎల్పీజీ, ఇంధనం కొరతపై ఆందోళనలను ప్రస్తావిస్తూ, ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు పాల్పడవద్దని కోరారు. రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, ఏటా 26 కోట్ల టన్నుల రిఫైనరీ సామర్థ్యం మనకు ఉందని చెప్పారు. గత రెండు రోజులుగా రిటైల్ ఔట్‌లెట్‌లు, పెట్రోల్ బంకుల వద్ద పెద్దఎత్తున జనం క్యూలు కడుతుండటం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఆందోళన అవసరం లేదని, దేశంలో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. పెట్రోల్, డిజిల్ ధరలు కూడా పెరగబోవడం లేదని వివరించారు. వలస కార్మికులకు ప్రాధాన్యతా క్రమంలో 5




కిలోల సిలెండర్లు అందిస్తామని సుజాతా శర్మ తెలిపారు. 26 రాష్ట్రాలకు 22,000 టన్నుల ఎల్పీజీ కేటాయించామన్నారు. మంగళవారంనాడు 30,000 ఐదు కేజీల సిలెండర్లు ఇచ్చామని చెప్పారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలకు కళ్లెం వేసేందుకు 2,700 దాడులు జరిపామని, 2,000 సిలెండర్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై వస్తున్న వార్తలు నిజం కాదనీ, గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవనీ సుజాత శర్మ వివరించారు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుందని సుజాత శర్మ స్పష్టం చేశారు. ఇదిలావుంటే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్పీజీ కొరతను అధిగమించడం సహా గ్యాస్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పైప్డ్ న్యాచురల్ గ్యాస్(పీఎన్‌జీ) సరఫరా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వెంటనే దానికి మారాలని ఆయా వినియోగదారులకు సూచించింది. లేనిపక్షంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్పీజీ) సరఫరాను నిలిపివేస్తామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది. దేశంలో పీఎన్‌జీని ప్రోత్సహించే దిశగా ముందడుగు వేస్తున్న కేంద్రం.. ఈ మేరకు 3 నెలల గడువు నిర్దేశిస్తూ ఆదేశాలు జారీచేసింది. పీఎన్‌జీ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని ఎల్పీజీ సిలిండర్లను మౌలిక సదుపాయాలు లేని ఏరియాలకు మళ్లించడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది. పీఎన్‌జీకి మారడం వల్ల రీఫిల్ బుక్‌చేసే అవసరముండదు. దీంతోపాటు నిరంతర గ్యాస్ సరఫరా అందుబాటులో ఉంటుంది. అయితే.. పీఎన్‌జీ సరఫరాలో సాంకేతిక సమస్యలు, ఇంటికి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వడం అసాధ్యమైన సందర్భంలో మాత్రమే ఎల్పీజీ సరఫరా కొనసాగుతుంది.కానీ.. దానికి పీఎన్‌జీ గ్యాస్ కంపెనీ నుంచి నిరభ్యంతర పత్రంతప్పనిసరి. మేరకు పీఎన్‌జీ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు పలు చర్యలు చేపట్టింది కేంద్రం. పైప్డ్ గ్యాస్ లైన్‌కు నిర్ణీత గడువులోగా అధికారులు అనుమతులు మంజూరు చేయాలి. నిర్దేశిరచిన ఫీజుకంటే ఎక్కువ వసూలు చేయకూడదు. హౌసింగ్ సొసైటీలు లేదా భూయజమానులు కూడా పైపులైన్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదు. అలాంటి సందర్భాలేమైనా తలెత్తితే ఆ ప్రాంతానికి ఎల్పీజీ సరఫరాను నిలిపివేయడం సహా సంబంధిత వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది ప్రభుత్వం. వీటి అమలును పర్యవేక్షించడం సహా సమ్మతిని నిర్ధారించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డ్ నోడల్ అథారిటీకి బాధ్యతలు అప్పగించింది.

## ఇప్పసారాపై సభలో గందరగోళం

### బిజెపి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రుల ఆగ్రహం

హైదరాబాద్,

బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా శాసనసభలో గందరగోళం నెలకొంది. భాజపా ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పపువ్వు సారా అంశంపై శాసనసభలో చర్చ జరిగింది. సారా పథకానికి మాత్రం ఇందిరమ్మ పేరు పెట్టొద్దంటూ భాజపా ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్ప సారాకు ఇప్ప టకీలా లేదా.. మరేదైనా పేరు పెట్టుకోవాలని అన్నారు. దీన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తప్పుబట్టారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు. దివంగత మహిళా ప్రధానిని భాజపా ఎమ్మెల్యే అవమానించారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. భాజపా నేతలు ఇందిరమ్మ మీద ఇంకా అక్కసు ప్రదర్శిస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఇందిరాను అవమానించడమంటే మహిళా సమాజాన్ని అవమానించినట్లే అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇందిరా గాంధీని వాజ్‌పేయీ ఉక్కు మహిళ, దుర్గామాతా అని గతంలో అన్నారని గుర్తుచేశారు. అనంతరం తన వ్యాఖ్యలపై రాకేశ్‌రెడ్డి వివరణ ఇచ్చారు. ఇందిరా గాంధీపై గౌరవంతోనే ఆ పేరు పెట్టవద్దని చెప్పానన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఇప్ప సారా తయారీ కేంద్రం ఉండాలని సూచించానన్నారు. ప్రతి పథకానికి ఇందిరమ్మ పేరు పెట్టడం కాంగ్రెస్ వాళ్లకు అలవాటు. ఇప్పసారా పథకానికి మాత్రం దయచేసి ఆ పేరు పెట్టవద్దని సూచించాను. నేను చేసిన సూచనలో ఎలాంటి తప్పు లేదు. ఇందిరాగాంధీ ఉక్కు మహిళ.. ఆమె అంటే నాకు ఎంతో గౌరవం. ఆమె కాంగ్రెస్ నేత మాత్రమే కాదు.. భారత మాజీ ప్రధాని కూడా అని చెప్పారు.

## అరకులో యువకుడి దారుణ హత్య

అరకు,

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం దొరగుడాలోని ప్రైవేట్ రిసార్ట్స్ సమీపంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. విజయనగరం జిల్లా బొబ్బిలి సమీపంలోని జన్నీ వలస గ్రామానికి చెందిన నాగల సురేష్ (25) స్థానికంగా ఉంటున్న ఓ మహిళతో కలిసి దొరవలస సమీపంలోని రిసార్ట్స్‌లో అద్దెకు దిగాడు. మంగళవారం రాత్రి 10 గంటల సమయం సమయంలో రిసార్ట్స్ పక్కనే ఉన్న రోడ్డుపై యువకుడు మృతదేహం పడి ఉంది రిసార్ట్‌లో పనిచేసే యువకులే హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు కారణంపై పాడేరు పోలీసులు విచారణ చేస్తున్నారు.

## ఆశావర్కర్ల జీతాలపై హామీ మరిచారా?

### అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు

హైదరాబాదం, ఎన్నికల సందర్భంగా ఓట్లు దండుకోవడం కోసం అలవిమాలిన హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీష్‌రావు మండిపడ్డారు. అసెంబ్లీ వేదికగా సర్కారుపై నిప్పులు చెరిగారు. ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నాడు తన ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్నదని ఆయన గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ తన మానిఫెస్టోలో పేర్కొన్న మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి ఇస్తుందని ప్రశ్నించారు. గత వారం రోజులుగా ఆశా వర్కర్లు ధర్నా చేస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం వారికి రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్‌ను కూడా బంద్ చేశారని విమర్శించారు. దాంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలు 20 శాతం తగ్గాయని చెప్పారు. దీనిపై ప్రభుత్వ చర్యలు ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్‌ను ఎప్పటి నుంచి తిరిగి ప్రారంభిస్తారో చెప్పాలని నిలదీశారు.

## అరటి రైతులను ఆదుకోండి

### గిట్టుబాటు ధరలు కల్పించండి
### అరటి గెలలను వేసుకుని రైతులతో ర్యాలీ
### కడప కలెక్టరేట్ వద్ద ధర్నాకు యత్నం
### వైఎస్ షర్మిల డిమాండ్

కడప,

అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల కోరారు. కోల్డ్ స్టోరేజీ సౌకర్యాల విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని తెలిపారు.ఎన్నికల ముందు ప్రచారం కోసం మాత్రమే పులివెందులలో అరటి ప్రాసెసింగ్ యూనిట్‌ను జగన్ ప్రారంభించారని విమర్శలు చేశారు. అరటి రైతుల సమస్యలపై కూడా షర్మిల స్పందించారు. పంట నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడపకు వచ్చిన వైఎస్ షర్మిల రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి వ్యానులో అరటి గెలలు వేసుకొని ర్యాలీగా కడప కలెక్టరేట్ కు చేరుకున్నారు. పంట నష్టపోయిన అరటి రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్ షర్మిల రెడ్డి మాట్లాడారు. నిన్న పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలంలోని కసునూరు గ్రామంలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నానన్నారు. రైతులు తమ దఅష్టికి తెచ్చిన సమస్యలను జిల్లా జాయింట్ కలెక్టర్ వివరించడం జరిగిందన్నారు. అకాల వర్షానికి అరటి తోటలు పూర్తిగా దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. మన రాష్ట్రంలో అరటి 70 నుంచి 80 లక్షల వరకు పండిస్తున్నారని తెలిపారు. 58 శాతం రాయలసీమ నుండి అరటి పండుతోందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లేక కొట్టుమిట్టాడుతున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను 26 వేల రూపాయలు పలికిన అరటి ఈరోజు 6 వేల రూపాయల కన్నా తక్కువగా పడిపోయిందన్నారు. దేశంలోనే మన రాష్ట్రంలో బెస్ట్ క్వాలిటీ అరటి పంట సాగు అవుతుందని, ఇతర దేశాలకు ఎక్స్పోర్ట్ చేసుకుంటారన్న నమ్మకంతో రైతులు అరటి పంటను పండించారన్నారు. ప్రస్తుతం రేటు పడిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారన్నారు. రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చేంతవరకు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు లేక ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ లు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేయడంతోపాటు మార్కెటింగ్ సపోర్ట్ కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అరటికి కనీస గిట్టుబాటు ధర 12 వేల రూపాయలు కల్పించాలన్నారు. ధరల స్థిరీకరణ నిధులను రైతుల మేలు కోసం ఉపయోగించాలన్నారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి తమ టార్గెట్ కానే కాదని వైయస్ షర్మిలారెడ్డి అన్నారు. పులివెందుల అరటి రైతులతో కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ ప్లాంట్ పూర్తిగా ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. 2023లో పులివెందులలో ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ ప్రారంభించాలని చెప్పుకుంటున్నారన్నారు. ఆయన చెప్పిన మాటల్లో నిజం లేదన్నారు. అసలు నిజం ఏమిటంటే 2024 మార్చి 11న ఎన్నికల కోడ్ వచ్చే ముందు ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ పనులు పూర్తిగా కాకపోయినా జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారన్నారు. ఏదైనా చెప్పితే అందులో నిజం ఉండాలన్నారు. కుటుంబ వ్యవహారాలు, ఆస్తులకు సంబంధించిన విషయం గురించి మా తల్లి విజయమ్మ ఎవరు మాట్లాడకండి అని చెప్పినా కూడా వైసిపి మాట్లాడుతుందని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి తమ టార్గెట్ కానే కాదని, మీరు మమ్మును టార్గెట్ చేస్తూ మాట్లాడితే మేము టా÷-గ్గ÷ట్ చేస్తామని సవాలు చేశారు. వైసీపీ జోలికి వెళ్లాల్సిన అవసరం తనకు లేదనివెల్లడించారు. కానీ తనపై విమర్శలు చేస్తే తాను కూడా స్పందించాల్సి వస్తుందని తెలిపారు. తన లక్ష్యం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాదని, అయితే వైసీపీ నేతల వ్యాఖ్యల వల్ల తరచూ వివరణ ఇవ్వాల్సి వస్తోందని అన్నారు. తాను ఎవరినీ కుక్కలతో పోల్చలేదని షర్మిల స్పష్టం చేశారు. విజయమ్మ లేఖ వచ్చిన తరువాత కూడా తమపై విమర్శలు కొనసాగుతుండటంతోనే మొరగడం కుక్కల నైజం అన్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్. డి. విజయ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్, నియోజకవర్గ ఇన్చార్జ్ లు ధ్రువ కుమార్ రెడ్డి, ఇర్ఫాన్, శివ మోహన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజరు సుశీల్ కుమార్, పాల్గన్నారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా తాడూరి



**న్యూస్ వార్ చౌటుప్పల్ మార్చి 26**

చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ అద్యక్ష పదవికి జరిగిన ఎన్నికలలో ప్రత్యర్థి వాకిటి నరసింహారెడ్డి పై తాడూరి పరమేష్ 17 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన పోటిలో పాల పరమేష్ పై పలమటి మహిపాల్ రెడ్డి 11 ఓట్ల మెజారిటీతో సహాయ కార్యదర్శిగా మక్తాల నరసింహ ప్రత్యర్థి జంపాల శ్రీశైలం పై 15 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా పిట్టల బిక్షమయ్య, కోశాధికారిగా అల్లి స్వాతి, లైబ్రరీ సెక్రెటరీగా నర్రి స్వామి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా దేశ గోని శ్రీశైలంలు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గాఎండి. ఖయ్యూం పాషా, పిల్లలమర్రి కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు రాధాకిషన్ రావు, కానుగుల వెంకటయ్య ప్రకటించారు.

# చౌటుప్పల్‌లో ప్రారంభమైన నవమి వేడుకలు



**చౌటుప్పల్ మార్చ్ 26**

శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఈరోజు చౌటుప్పల్ లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో విశ్వక్సేనారాధన పుణ్యాహవాచనం కలశస్థాపన అంకురార్పణ ధ్వజారోహణ కార్యక్రమాలు వేద పండితులు కత్తి సుధాకర్ శర్మ పెద్ది కిషోర్ శర్మల వేదమంత్రోచ్చారణలతో ప్రారంభమైనవి. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు బొబ్బిళ్ళ మురళి మాట్లాడుతూ రేపు శుక్రవారం శ్రీరామనవమి సీతారాముల కళ్యాణ ఉత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కళ్యాణ ఉత్సవాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుతూ కళ్యాణోత్సవ అనంతరం భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేయడం జరిగుతుందని ప్రజలు తప్పకుండా సీతారాముల కళ్యాణాన్ని కన్నుల విందుగా చూసి తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్, ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్, కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాసు, సుర్వి నర్సింహా గౌడ్,చిక్క నరసింహ మాజీ ఎంపీపీ ముత్యాల భూపాల్ రెడ్డి, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి,బత్తులశ్రీశైలం గౌడ్, ఉడుగు మల్లేష్ గౌడ్, డాకోజి లక్ష్మీనారాయణ, ఉడుగు రమేష్ గౌడ్,శమహిళా భక్తులు కొసనం అనురాధ, రాజపేట శ్రీలత , అనూష, మామిడి వెంకటమ్మ, దాడి పద్మ, మల్లీశ్వరిలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

# దక్షిణాది రాష్ట్రాలపై సవతి ప్రేమ చూపుతున్న బిజెపి- పునకైలాస్

**న్యూస్ వార్ నల్లగొండ మార్చి 26 :**



దక్షిణాది రాష్ట్రాలపై భారతీయ జనతా పార్టీ వివక్షత చూపుతుందని డిసిసి అధ్యక్షులు పున్నకైలాసనేత తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన ద్వారా తిరిగి అధికారంలోకి రావాలనేటువంటి ఉద్దేశంతో సమతోల్యత లేకుండా నియోజకవర్గాల పునర్విభజన చేస్తుందని ప్రస్తుతం ఉన్న నిష్పత్తిలోనే నియోజకవర్గల పునర్విభజన జరగాలని ఆయన డిమాండ్ చేశారు దక్షిణాది రాష్ట్రాల్లో తమ పార్టీ ఉనికి లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాల రాబయం తగ్గించేలా బిజెపి కుట్ర చేస్తుందని అన్నారు బిజెపి యొక్క పొట్టేల ఉద్దేశాన్ని ప్రజలందరూ గమనించాలని ఆయన పిలుపునిచ్చారు.

# విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించాలి.. విద్యాశాఖ అధికారి గురువారావు

**న్యూస్ వార్ చౌటుప్పల్ మార్చి 26**

చందన స్కూల్ వార్షికోత్సవం ప్రిన్సిపల్ అవ్వారు రామేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చౌటుప్పల్ మండలం విద్యాశాఖ అధికారి గురువారావు విద్యార్థులనుదేశించి మాట్లాడుతూ విద్యార్థులు పఠనాసక్తి ని పెంపొందించుకోవాలని, బాల్యం నుండే సంకోచించకుండా ప్రశ్నించే మనస్తత్వాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా విషయపరిజ్ఞానం పెరుగుతుందన్నారు , జంక్ ఫుడ్ కు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మారుతూ శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఇది కేవలం పిల్లలకు కాకుండా పెద్దవాళ్లకు కూడా అవసరమైన విషయమని తెలియజేశారు అలాగే తమ పిల్లల్ని మొబైల్స్ నుండి టీవీ కార్యక్రమాల నుండి కొంత దూరంగా ఉంచుతూ వారి విద్యాభ్యాసాన్ని, జీవనశైలిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన కౌన్సిలర్ పాక చిరంజీవి మాట్లాడుతూ




తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. విశ్రాంత ఆరోగ్య అధికారి బడుగు శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులలో చక్కటి సౌశీల్యమును పెంపొందించుటకు తల్లిదండ్రులు విద్య నేర్పే గురువులు మరియు పాఠశాల యాజమాన్యం, కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అవ్వారు గోవర్ధన్, తల్లిదండ్రుల కమిటీ



అధ్యక్షులు దండు అరుణ్ కుమార్ , ప్రైవేటు కళాశాలల యాజమాన్య జిల్లా అధ్యక్షులు శంకర్ , ప్రముఖ వైద్యులు పాశం శివ కుమార్, ప్రముఖ చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన అనేక కళారూపాలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.

# ట్రినిటీ స్కూల్లో శ్రీరామనవమి వేడుకలు





**న్యూస్ వార్ చౌటుప్పల్ మార్చి 26**

ఈరోజు ట్రినిటీ హైస్కూల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ట్రాఫిక్ ఆర్ ఎస్ ఐ ఆంజనేయులు విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన కలిగించారు. 21 సంవత్సరాలు దాటిన వారు ఎవరైనా లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపకూడదని తెలియజేశారు. అలాగే విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు సిగ్నల్స్ వద్దనే రోడ్డు దాటవలనని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు బైక్ పై ప్రయాణం చేసేటప్పుడు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలని చెప్పాలని చెప్పారు. స్కూల్ చైర్మన్ ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ ఉజ్జిని మంజుల శ్రీరామనవమి సందర్భంగా విద్యార్థులకు శు భాకాంక్షలు తెలియజేస్తూ మర్యాద పురుషోత్తముడైనటువంటి శ్రీరాముని జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని తల్లిదండ్రుల పట్ల గురువుల పట్ల శ్రీరాముడు చూపించినటువంటి వినయాన్ని, శ్రద్ధను కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ సైదిరెడ్డి మరియు మరియు పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు


# మున్సిపల్ పన్నులను 100 శాతం వసూలు చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య

మున్సిపల్ పరిధిలో పన్నులను 100 శాతం వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. గురువారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ తో కలిసి పన్నుల వసూలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, మున్సిపల్ అభివృద్ధి కొరకు పన్ను వసూలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న బకాయిలను త్వరితగతిన వసూలు చేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. పన్నుల వసూలు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వేసవికాలం అయినందున ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు



నిబంధనల ప్రకారం త్వరగా ఇల్లు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,